క్లుప్తంగా

ఎల్లమ్మవ్వకు పౌర్ణమి పూజలు



రేణుకా ఎల్లమ్మవ్వకు హారతి ఇస్తున్న పూజారమ్మ

ఆదోని అర్బన్: పట్టణశివారులోని ఎల్లమ్మవ్వ కొండలో వెలిసిన శ్రీ రేణుకా ఎల్లమ్మవ్వకు పౌర్ణమి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు మోహన్‌ప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకం, పూల అలంకరణ, నిమ్మకాయల హారం, నైవేద్యం, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు చేశారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తు చేసుకోండి

ఆదోని సెంట్రల్: ఆదోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేయుటకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రి బుధవారం తెలిపారు. వారు మాట్లాడుతూ కళాశాలలో తెలుగు, ఎకనామిక్స్, బాటనీ సబ్జెక్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో అవగాహన కలిగి పీజీలో 55శాతం ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. అదనపు అర్హతలు కలిగి, అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. గురువారం నుంచి దరఖాస్తుల స్వీకరణ, డెమోలు ఉంటాయని, అర్హత కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గొర్రెల పెంపకంతో జీవనోపాధి



మాట్లాడుతున్న కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా. కె. రాఘువేంద్రచౌదరి

ఎమ్మిగనూరురూరల్: గొర్రెలు పెంపకం ద్వారా జీవనోపాధిని పెంపొందించుకోవచ్చని కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రాఘువేంద్రచౌదరి అన్నారు. బుధవారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో కెనరా బ్యాంక్, గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ) ఆధ్వర్యంలో గొర్రెల పెంపకంపై పెంపకందార్లకు పది రోజుల శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతో పాటు ప్రత్యామ్నాయంగా గొర్రెల పెంపకాన్ని చేపడితే మంచి లాభాలు పొందడమేకాకా, జీవనోపాధిని ఏర్పాటు చేసుకోవచ్చునని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో పశువైద్యులు డా. నిరంజన్‌రెడ్డి, కెనరా బ్యాంక్ సమన్వయకర్త ఎంబీ. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాపురం విద్యార్థినికి ఎంబీబీఎస్ సీటు



గాయత్రి

కౌతాళం: ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో 720 గాను 562 మార్కులు సాధించిన బాపురం గ్రామానికి చెందిన గాయత్రికి ఎంబీబీఎస్ సీటు వచ్చింది. స్టేట్ ర్యాంకు 5,094 కాగా, ఆల్ ఇండియా ర్యాంక్‌లో 1,21,690వ ర్యాంక్ సాధించిందని తండ్రి రంగన్న, తల్లి అనంతలక్ష్మిలు తెలిపారు. అనంతపురం గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో ఉచిత సీటు వచ్చిందన్నారు. రంగన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు.

నకిలీ విలేకరుల బెదిరింపు

ఆదోని అర్బన్: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని ఓ హోటల్‌లో నకిలీ విలేకరులు బెదిరింపులకు పాల్పడి యజమానితో డబ్బులు తీసుకెళ్లిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. ముందుగా నకిలీ విలేకరులు పార్సిల్ తీసుకెళ్లి.. గంట తర్వాత ఆ హోటల్‌కు వచ్చి పార్సిల్‌లో పురుగు ఉందని, ఆ హోటల్ యజమానితో గొడవకు దిగినట్లు తెలిసింది. అంతేకాకుండా పార్సిల్‌లో పురుగు పడడంతో డబ్బు తిరిగి ఇవ్వాలని, లేదంటే సంబంధిత అధికారులకు చెప్పి హోటల్‌ను సీజ్ చేయిస్తామని బెదిరించినట్లు సమాచారం. దీంతో ఆ హోటల్ యజమాని డబ్బులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఈ విషయంపై టూటౌన్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా ఎవరూ తమకు ఫిర్యాదు చేయలేదని చెప్పారు.

బాధితురాలికి ఆర్థిక సాయం



బాధితురాలికి ఆర్థిక సాయం అందజేస్తున్న న్యాయవాదులు

ఎమ్మిగనూరుటౌన్: పెద్దకడుబూరు మండలంలోని కల్లుకుంట గ్రామంలో ఓ సామాజిక వర్గం చేతిలో దాడికి గురై స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దళిత గోవిందమ్మకు బుధవారం డాక్టర్ బాబా సాహెబ్ కమిటీ సభ్యులు న్యాయవాదులు కాకర్ల చంద్రశేఖర్, సునీల్‌కుమార్ రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు ఎల్‌ఐసీ ప్రభాకర్, మాలమహానాడు నర్సన్న, ముత్తుసుమాల, జడ రవి, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు భృతి ఇస్తుందో లేదో?



నాపేరు షాబీర్‌బాషా, ఆదోనిలో నివాసం ఉంటాను. నేను బీఏ, బీఈడీ పూర్తి చేశాను. డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నా. కూటమి ఎన్నికల సమయంలో ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3000 నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులైనా ఇప్పటి వరకు నిరుద్యోగభృతి విడుదల చేయలేదు. దానిపై ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇప్పటివరకు నాకు ఎలాంటి నిరుద్యోగభృతి అందలేదు. అసలు అందుతుందో లేదో కూడా తెలియడం లేదు. నిరుద్యోగ భృతి ఇస్తే పరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు సహాయంగా ఉంటుంది.

గత ప్రభుత్వంలో అమ్మఒడి సకాలంలో అందేది



నాపేరు పీరమ్మ, మాది ఆదోనిలోని లేబర్‌కాలనీ, మా ఆయన టైలరింగ్ పని చేస్తున్నారు. నేను కూలీ పనులకు వెళ్తున్నాను. మాకు ముగ్గురు పిల్లలు ఉండగా, వారు ప్రభుత్వ బడిలోనే చదువుకుంటున్నారు. గత జగనన్న ప్రభుత్వంలో అమ్మ ఒడి పథకం సకాలంలో అందేది. దీంతో పిల్లలకు ఎంతగానో ఉపయోగపడేది. టీడీపీ ప్రభుత్వం ప్రతి విద్యార్థికి రూ.15 వేలు అందిస్తామని మాట ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పాటు అయ్యి వంద రోజులైనా ఇంతవరకు తల్లికి వందనం పథకం కింద డబ్బులు జమ చేయలేదు. విద్యాశాఖ మంత్రి లోకేష్ తల్లికి వందనం వచ్చే ఏడాది నుంచి ఇస్తామనడం సరికాదు. పథకం అమలు చేస్తేమ తమకు రూ.45 వేలు రావాల్సి ఉంది. ఎప్పుడు ఇస్తారా అని ఎదురుచూస్తున్నా.

మాట తప్పకూడదు



నాపేరు సరస్వతి. మాది కోసిగి మండలం కందుకూరు గ్రామం. కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నాం. చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో ప్రతి మహిళకు రూ.1500 ఇస్తామని ప్రకటించారు. అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఇంత వరకు మహిళలకు పైసా ఇవ్వలేదు. పైగా పథకాలు అమలు చేయాలంటే భయమేస్తుందని సీఎం చంద్రబాబు అంటున్నారు. హామీ అమలు చేస్తే గ్రామీణ ప్రాంతాల్లో కూలీ పనులు చేసుకుని జీవనం సాగించే నాలాంటి మహిళలకు ఖర్చులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. మాట తప్పకుండా ఇవ్వాలి.

- అధికారమే పరమావధిగా సూపర్ సిక్స్ పేరుతో కూటమి హామీలు
- అధికారం చేపట్టి వంద రోజులైనా అమలుకు నోచుకోని వైనం
- ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో పథకాల ఊసేలేదు
- అమలు చేయాలంటే భయమేస్తోందంటున్న సీఎం చంద్రబాబు
- ఆందోళనలో లబ్ధిదారులు

సూపర్ వంచన

'ఏరు దాటాకా తెప్ప తగిలేయటం' అన్న చందంగా ఎన్నికలయ్యాక హామీలన్నీ తుంగలో తొక్కేశారు. అధికారమే పరమావధిగా సూపర్ సిక్స్ పథకాల పేరుతో, గతంకంటే ఘనంగా అంటూ హామీలు ఇచ్చి ప్రజలను వంచించారు తెలుగుదేశం, కూటమి పెద్దలు. ప్రజల అవసరాలు, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని హామీల గారడీతో బురడీ కొట్టించారు. అధికారం చేపట్టి వందరోజులైనా పథకాలు అమలుకు నోచుకోలేదు. శాసనసభలో ప్రవేశపెట్టిన ఓటాన్ బడ్జెట్‌లో సూపర్ సిక్స్ పథకాలకు చిల్లి గవ్వ కేటాయించకుండా ఉసూరు మనిపించింది. పైపెచ్చు పథకాలు అమలు చేయాలంటే భయమేస్తోందని సాక్షాత్తు ముఖ్యమంత్రే చెప్పడంతో పథకాల అమలుపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఓవైపు పిల్లల చదువులు.. మరోవైపు రైతన్నల అవసరాలు.. ఇంకో వైపు ఆడపడచుల ఆశలు.. నిరుద్యోగుల ఆర్తనాదాలు వీటన్నింటినీ తుంగలో తొక్కి పాత కథలను తిరగతోడుతున్నారు ప్రభుత్వ పెద్దలు.

ఆదోనిటౌన్/ఎమ్మిగనూరు/మంత్రాలయం: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏప్రిల్ 28వ తారీఖున సీఎం చంద్రబాబు కౌతాళం మండల కేంద్రంలో, మార్చి 31న ఎమ్మిగనూరులో ప్రచారం నిర్వహించారు. అలాగే ఏప్రిల్ 30న నారా లోకేష్ యువగళం నిర్వహించారు. ప్రచారంలో తండ్రీకొడుకులు వేలాది మంది జనాల మధ్య సూపర్ సిక్స్‌పై చిలక పలుకులు పలికారు. అమ్మఒడి పథకానికి పేరు మార్చి తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి రూ.15 చొప్పున ఇస్తామన్నారు. రైతుభరోసాకు అన్నదాత సుఖీభవగా పేరు మార్చి ఒక్కో రైతుకు ఏడాదికి రూ.20 ఆర్థికసాయం అందజేస్తామని చెప్పారు. అలాగే 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1500, నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామంటూ హామీలు గుప్పించారు. అధికారదాహంతో చంద్రబాబు అబద్ధపు హామీలు గుప్పిస్తే.. తానేమి తక్కువ కాదంటూ పవన్‌కళ్యాణ్ అదే అబద్ధాలతో ఊరేగారు. ఇప్పుడేమో అమలు చేయడంపై భయమేస్తోందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చట్ట సభలోనే చెప్పడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పథకాలపై తిరకాసు పెట్టేసి తప్పించుకునే పనిలో పడ్డారు. అమ్మ ఒడితో గత ప్రభుత్వం పేద విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తే, తల్లికి వందనం అంటూ కూటమి ప్రభుత్వం పేరుమార్చి అందరినీ ఏమార్చింది. ఈ ఏడాది తల్లికి వందనంలేదని ఏకంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అసెంబ్లీలో తేల్చేయడంతో ఓట్లేసి మోసపోయిన తల్లులు తెల్లమొహం వేశారు. సూపర్ సిక్స్ అమలుపై ఇప్పటికే ప్రజల్లో నమ్మకం సన్నగిల్లింది. మాజీ ముఖ్యమంత్రి జగనన్న పాలనకు.. చంద్రన్న సాకులకు ప్రజలు బేరీజు వేసుకునే పనిలో పడ్డారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో చేకూరిన లబ్ధి (రూ)

పథకం	లబ్ధిదారులు	చేకూరిన లబ్ధి
ఆదోని నియోజకవర్గం..		
అమ్మ ఒడి	35,000	210.00 కోట్లు
రైతు భరోసా	21,292	143.72 కోట్లు
ఎమ్మిగనూరు నియోజకవర్గం..		
అమ్మ ఒడి	39,066	234.39కోట్లు
రైతు భరోసా	44,476	214.04 కోట్లు
మంత్రాలయం నియోజకవర్గం..		
అమ్మఒడి	39,302	170.56 కోట్లు
రైతు భరోసా	44,716	235.81 కోట్లు



ఆదోని నియోజకవర్గంలో సూపర్ సిక్స్ పథకాలకు అర్హులు, అందాల్సిన సాయం

పథకం	అర్హులు	అందాల్సిన మొత్తం (రూ.కోట్లలో)
తల్లికి వందనం	48,104	72.15 (ఏడాదికి)
అన్నదాత సుఖీభవ	21,292	42.58 (ఏడాదికి)
మహిళలు రూ.1500	97,601	14.64 (ప్రతినెలా)
నిరుద్యోగభృతి	38,612	11.58 (ప్రతినెలా)



ఎమ్మిగనూరు నియోజకవర్గంలో సూపర్ సిక్స్ పథకాలకు అర్హులు, అందాల్సిన సాయం

పథకం	అర్హులు	అందాల్సిన మొత్తం (రూ.కోట్లలో)
తల్లికి వందనం	75,139	112.7 (ఏడాదికి)
అన్నదాత సుఖీభవ	44,476	88.95 (ఏడాదికి)
మహిళలు రూ.1500	98,765	14.81 (ప్రతినెలా)
నిరుద్యోగభృతి	36,700	11.1 (ప్రతినెలా)

మంత్రాలయం నియోజకవర్గంలో సూపర్ సిక్స్ పథకాలకు అర్హులు, అందాల్సిన సాయం

పథకం	అర్హులు	అందాల్సిన మొత్తం (రూ.కోట్లలో)
తల్లికి వందనం	58,159	87.23 (ఏడాదికి)
అన్నదాత సుఖీభవ	45,209	90.41 (ఏడాదికి)
మహిళలు రూ.1500	83,772	12.56 (ప్రతినెలా))
నిరుద్యోగభృతి	14,030	4.20 (ప్రతినెలా)

నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు?



నేడు రెండేళ్ల క్రితం డిగ్రీ పూర్తి చేశాను. ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నా. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నా. నిరుద్యోగులకు ప్రతినెల రూ.3000లు ఇస్తామంటూ ఎన్నికలకు యేడాది ముందు నుంచే చంద్రబాబునాయుడు ప్రచారం చేశారు. అధికారం చేపట్టి వంద రోజులైనా ఇంత వరకూ నిరుద్యోగభృతి ఇవ్వలేదు. జాబ్ క్యాలెండర్ లేదూ.. ఇటూ నిరుద్యోగ భృతి లేదంటే యువత ఏమైపోవాలి. అసెంబ్లీలో శ్వేతపత్రాలు కాదు విడుదల చేయాల్సింది, నిరుద్యోగభృతిపై జీవో ఇవ్వండి.

– రాజేష్, నిరుద్యోగి, గిడికల్ గ్రామం.

రైతులకు ఒక్క రూపాయి కూడా అందించలేదు



ఇప్పటివరకు టీడీపీ ప్రభుత్వం రైతులకు ఒక్క రూపాయి కూడా సాయం అందించలేదు. ఎన్నికల సమయంలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా యేడాదికి రూ.20 వేలు అందిస్తామని ఊదరగొట్టారు. ఇప్పుడు ఒక్కరూపాయి ఇచ్చిన పాపాన పోలేదు. అసలు టీడీపీ ప్రభుత్వానికి రైతులు కనిపిస్తున్నారో లేదో.. గత జగనన్న ప్రభుత్వంలో ఏడాదికి రూ.13,500 అందేది. అవి సకాలంలో ఇవ్వడంతో పంట పెట్టుబడులకు ఉపయోగపడేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

– పోతయ్యగారి తిమ్మయ్య, ఆదోని

నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూస్తున్నా



సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా నిరుద్యోగులకు నిరుద్యోగభృతి కింద రూ.3 వేలు అందిస్తానని మాట ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడి వందరోజులైనా ఇంతవరకు నిరుద్యోగభృతి అందించలేదు. ఇప్పటివరకు నిరుద్యోగభృతిపై ఎలాంటి ప్రకటన చేయలేదు. బీఎస్సీ కంప్యూటర్స్ చదువుకొని ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నా. ప్రభుత్వం అందించే సాయం ద్వారానైనా మేము చదువుకోవడానికి ఉపయోగడతామని భావిస్తున్నా.

– ఉమేష్, నిరుద్యోగి, ఆదోని

పిల్లల చదువుకు కష్టం



కూలి పనులు చేసుకుంటూ నలుగురు పిల్లలను చదవించుకుంటున్నాం.మేము వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. మాకు ముగ్గురు మగపిల్లలు 10, 6, 4 తరగతుల్లో చదువుతున్నారు. కుమార్తె 3వ తరగతి చదువుతోంది. మా పిల్లలకు తల్లికి వందనం డబ్బు రాలేదు. మారు. రూ.60వేలు రావాలి. పిల్లను చదివించుకోవడం కష్టం మారింది. డబ్బులు ఇస్తే పిల్లల చదువులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. గతంలో ప్రభుత్వం అయితే అమ్మఒడి కింద పాఠశాలల ప్రారంభంలోనే డబ్బులు తమ ఖాతాలో జమ చేసేది.

– చిన్నలక్ష్మి , కౌతాళం

నిరుద్యోగ భృతి అమలు చేయాలి



మాది కోసిగి గ్రామం. డిగ్రీ బీఏ పూర్తి చేసి, గ్రంథాలయ కోర్సు కూడా చేశాను. ఉద్యోగం కోసం పోరాడుతున్నాను. రాష్ట్రంలో కూటమి నాయకులు ఎన్నికల ముందు నిరుద్యోగులకు రూ.3వేలు నిరుద్యోగ భృతి కల్పిస్తామని ప్రగల్భాలు పలికారు. ఓటాన్ బడ్జెట్‌లో నిరుద్యోగ భృతి పై ఎక్కడా ప్రస్తావన చేయలేదు. ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగులకు షరతులు లేకుండా నిరుద్యోగ భృతి అమలు చేయాలి.

– వీరేష్, కోసిగి

రైతులకు కష్టాలు తప్పేలా లేవు



నాకు మూడెకరాల భూమి ఉంది. ప్రస్తుతం కంది సాగుచేస్తున్నా. వ్యవసాయం చేయాలంటే రూ.వేలల్లో ఖర్చు పెట్టాలి. మళ్లీ 10 ఏళ్లనాటి కష్టాలు మొదలయ్యాయి. అప్పులు చేసి వ్యవసాయం చేసినా పంట దిగుబడి వచ్చే సమయానికి ధరలు పలకవు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసాతో ఆదుకుంది. ఈ ప్రభుత్వం ఏర్పడి వందరోజులైనా రైతు భరోసా ఊసే ఎత్తడం లేదు. సీజన్ ప్రారంభమయ్యింది. రాబోయే రోజుల్లో రైతులకు కష్టాలు తప్పేలా లేవు.

– రంగన్న, రైతు, గోనెగండ్ల

గతంలో సమయానికి రైతు భరోసా ఇచ్చేవారు



నేను 25 ఎకరాల్లో పత్తి, మిరప సాగు చేస్తున్నాను. గతంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నప్పుడు ఖరీఫ్ సీజన్‌లో ఠంఛన్‌గా రైతు భరోసా అందించేవాడు. అది ఎంతో ఊరటనిచ్చేది. ప్రతి రైతుకు రూ. 20వేలు ఇస్తామని ఎన్నికల ముందు ప్రగాల్భాలు పలికిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ రైతులకు ఎగనామం పెట్టారు. కూటమి నాయకులు రూ. 20వేలు ఇస్తామని ఆశచూపి రైతులను ఇలా నట్టేట ముంచడం సరికాదు. అసలే వర్షాలు సరిగ్గా లేక పెట్టుబడులకు ఇబ్బందిగా మారింది. రైతుల కంటతడి రాష్ట్రానికి అంత మంచిదికాదు.

– నవీన్‌రెడ్డి, పెద్దకడబూరు

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న మున్సిపల్ కమిషనర్



మొక్క నాటుతున్న హెచ్‌డీఎఫ్‌సీ సిబ్బంది

ఎమ్మిగనూరుటౌన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని టిడ్కో గృహాల వద్ద ఏక్ పేడ్ మాకే నామ్‌లో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ నీరజ, మెప్మా సీఎంఓ జయవర్ధన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆదోని సెంట్రల్: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మేనేజరు శివరామకృష్ణ రెడ్డి తెలిపారు. బుధవారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వారి సౌజన్యంతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మొక్కలు నాటడం వలన కలిగే ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమములో ఎన్ఎస్ఎస్ అధికారులు జోనాథన్ విక్లీఫ్, వెకంట్ రామిరెడ్డి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యం బాటిళ్లు, నిందితులతో సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్

కోసిగి: అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న నలుగురు వ్యక్తులు పట్టుబడినట్లు కోసిగి సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. బుధవారం పోలీస్ స్టేషన్‌లో నిందితుల అరెస్ట్ చూపించారు. వారు మాట్లాడుతూ సమాచారం ఆధారంగా అగసనూరు గ్రామానికి చెందిన గోవిందురాజులు, బారిక నరసప్ప, హరిజన సుందర్ రాజు, హరిజన సిద్ధప్ప ఆర్డీఎస్ ఆనకట్ట సమీపంలో 16 బాక్స్‌లలో 1536 టెట్రా ప్యాకెట్లు నిల్వ చేసి ఉంచగా పట్టుకున్నట్లు తెలిపారు. నిందితులను అదుపులో తీసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

మంత్రాలయం : మాధవరం గ్రామానికి చెందిన గురిమింటి రామయ్య అనే వ్యక్తి అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు మాధవరం ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం గ్రామ శివారు నుంచి 3 బాక్స్‌లలో 288 టెట్రా ప్యాకెట్లు తీసుకెళ్లుతుండగా పట్టుబడి నట్లు తెలిపారు. నిందితుడిని అదుపులో తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం రమేష్‌నాయుడు

కౌతాళం: గెలుపు ఓటములను క్రీడకారులు సమానంగా తీసుకోవాలని ఎరిగేరి జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్‌నాయుడు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆడిప్పగౌడ్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, అండర్-17 బాల, బాలికల మండలస్థాయి క్రీడా పోటీలను బుధవారం ఎరిగేరి జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ప్రారంభించారు. బాలికలకు పోటీలను గురువారం కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఖలీల్‌అహ్మద్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకటపతిరాజు, నాయకులు రామలింగ, బసవరాజు పాల్గొన్నారు.

పాతకక్షతో దాడి.. నలుగురికి గాయాలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని మసీదపురం గ్రామంలో బుధవారం పాత కక్షలతో ఓ వర్గంపై మరో వర్గం వారు కర్రలతో దాడి చేయడంతో నలుగురికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన కురవ రాముడు, కురవ ఆంజనేయులుకు అదే గ్రామానికి చెందిన బోయ ఆంజనేయులు మధ్య కొంత కాలంగా మనస్పర్థలు ఉన్నాయి. బుధవారం ఉదయం బోయ ఆంజనేయులు, బోయ లక్ష్మీ నరసమ్మ, బోయ నరసింహులు, బోయ రవిలు పత్తి బేళ్లను ఆటోలో ఎత్తుతుండా వెనుక నుంచి వచ్చిన కురవ రాముడు, కురవ ఆంజనేయులు, ఉడత నరసింహులతో పాటు మరి కొందదరు కర్రలతో దాడి చేయటంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ కె.శ్రీనివాసులు గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని తెలుసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కురవ రాముడు, కురవ ఆంజనేయులు, ఉడత నరసింహులతో పాటు మరో ఏడు మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ఆదోని అర్బన్: మండలంలోని ఎద్దతుంబళం గ్రామానికి చెందిన నాగరాజుతో పాటు మరొకరిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ సూర్యమోహన్‌రావు బుధవారం విలేకరులకు తెలిపారు. పొలం తగాదాపై న్యాయవాది చంద్రను కులం పేరుతో దూషించినందుకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

అన్నా క్యాంటీన్ల పరిశీలన



అన్నా క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న అన్నా క్యాంటీన్లను బుధవారం ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆదోని పట్టణంలో ఈనెల 19వ తేదీన గురువారం ప్రారంభోత్సవం అయ్యే పాత లైబ్రరీ, శ్రీనివాసభవన్, ప్రసూతి ఆస్పత్రి సమీపాల్లో ఉన్న అన్నా క్యాంటీన్లను తనిఖీ చేశారు. ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ అనుపమ, సంబంధిత అధికారులు ఉన్నారు.

ఆశలను అడియాశలు చేసిన ప్రభుత్వం




సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఆదోని సెంట్రల్: వైద్య విద్యను చదవాలనుకునే విద్యార్థుల ఆశలను కూటమి ప్రభుత్వం అడియాసలు చేసిందని విద్యార్థి, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు ముక్తకంఠంతో విమర్శించారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం రెవెన్యూ భవనంలో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ పేద మధ్య తరగతి విద్యార్థులకు విద్యను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. ప్రభుత్వం బాధ్యతలను మరచి వసతులు లేవని ఎన్ఎంసీకి లేఖ రాయడంలో అంతర్యమేమిటోనని వారు ప్రశ్నించారు. ప్రభుత్వం తీసుకున్న తప్పుడు నిర్ణయంతో పులివెందులకు వచ్చిన 50 సీట్లతో పాటు 700 సీట్లు కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ కళాశాలలకు నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఓపీ ఇచ్చి ఉంటే అనుమతులు లభించేవన్నారు. పేద మధ్య తరగతి విద్యార్థులకు మంచి జరుగుతుంటే స్వాగతించాల్సింది పోయి వ్యతిరేకించడం సరైన పద్ధతి కాదన్నారు. అధికారంలోకి రాక మునుపు ఒక మాట, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక మాట చెప్పడం ముఖ్యమంత్రి చంద్రబాబుకే సాధ్యమన్నారు. ఇప్పటికైనా వైద్య విద్య ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకొని ఎన్ఎంసీకి రాసిన లేఖను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవి శెట్టి ప్రకాశ్, సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు దేవదాస్, బీఎస్పీ అధ్యక్షుడు ఫయాజ్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సత్తన్న, జైభీమ్ నాయకులు దస్తగిరి నాయుడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు నాగరాజు, బీడీఏస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ రమేష్, ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్, డీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ పాల్గొన్నారు.

23న రాష్ట్రస్థాయి ఒంగోలు ఎద్దుల పోటీలు

గోనెగండ్ల : మండల కేంద్రంలో వెలసిన శ్రీ చింతలాముని, నల్లారెడ్డి స్వాముల వారి దశమి సందర్భంగా ఈనెల 23, 24 తేదీల్లో గోనెగండ్ల ట్రాక్టర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఒంగోలు ఎద్దుల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు ట్రాక్టర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో కరపత్రాలను విడుదల చేశారు. 23న ఆరుపళ్ల సైజు ఎద్దుల పోటీలు ఉంటాయని, విజేతలకు వరుసగా రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు. రూ.3వేలు బహుమతులు అందజేస్తామన్నారు. అలాగే 24న న్యూ క్యాటగిరీ ఎద్దుల బలప్రదర్శన పోటీలు ఉంటాయని, విజేతలకు రూ.50వేలు, రూ.40వేలు, రూ. 30వేలు, రూ.20వేలు, 10వేలు, రూ.5వేలు అందజేయడం జరుగుతుందన్నారు. ఆరుపళ్ల సైజు రూ.600, న్యూ క్యాటగిరీ రూ.700 ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు. వివరాలకు 82474 89945, 99491 51807, 85220 14358 నంబర్లను సంప్రదించాలన్నారు.

మురుగు కాలువల్లో పూడికతీత



పూడికతీత పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ అనుపమ

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని షేర్‌ఖాన్ కొట్టాల ప్రాంతంలో బుధవారం జరుగుతున్న పూడికతీత పనులను మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ అనుపమ పరిశీలించారు. మురుగు కాలువల్లో పూడికను పూర్తిగా ఎత్తివేయాలని, అక్కడక్కడ మధ్యలో గ్యాప్‌లు పెట్టడం వల్ల పూడిక మళ్లీ పెరుగుతోందని వర్కర్లకు సూచించారు. పూడికను పూర్తిగా ఎత్తివేస్తే కాలువలు శుభ్రమవుతాయని, దీంతో మురుగునీరు సులువుగా వెళ్తాయన్నారు. కాలువల్లో దోమల సంచారం ఉండదన్నారు.

నేడు అన్నా క్యాంటీన్ల ప్రారంభం

పట్టణంలో గురువారం మూడు అన్నా క్యాంటీన్‌లను ప్రారంభించనున్నట్లు మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ అనుపమ తెలిపారు. ఎమ్మెల్యే పార్థసారథి, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత చేతులమీదుగా ప్రారంభించనున్నామని చెప్పారు. నిర్మల్ టాకీస్ ఎదురుగా, శ్రీనివాస్‌భవన్ ఎదురుగా, పాత పోస్టాఫీసు పక్కన మొత్తం మూడు అన్నా క్యాంటీన్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె చెప్పారు.